క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

గంగాధర: రోడ్డు ప్రమాదానికి గురైన పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన తాళ్ల మల్లయ్య(78) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మల్లయ్య శుక్రవారం ఇంటి ముందు నుంచి రోడ్డు దాటుతుండగా.. అటువైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గర్శకుర్తి గ్రామానికి చెందిన ఓదెల నరేశ్ ఢీకొట్టాడు. బాధితున్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు తాళ్ల రవీందర్ శనివారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పాల ఆటో బోల్తా

శంకరపట్నం: మెట్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి పాల ఆటో బోల్తా పడింది. హుజూరాబాద్‌లోని పాల డెయిరీకి శుక్రవారం రాత్రి గ్రామాల్లో సేకరించిన పాల క్యాన్లు మెట్‌పల్లికి చెందిన ఆటోలో డ్రైవర్ తీసుకెళ్లాడు. అతడు హుజూరాబాద్‌కు వెళ్లినప్పుడు రోడ్డుపై ధాన్యం కుప్పలు లేవు. ఓ రైతు పొలంలో కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలించి మెట్‌పల్లి శివారులో రోడ్డుపై ధాన్యం కుప్ప పోసి పరదాలు కప్పాడు. హుజూరాబాద్ పాల డెయిరీలో పాలు పోసిన డ్రైవర్ తిరిగి అర్ధరాత్రి స్వగ్రామానికి ఆటోలో ఖాళీ పాల క్యాన్లతో వస్తుండగా.. రోడ్డుపై ధాన్యం కుప్పపైకి ఆటో ఎక్కి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

మహిళ అదృశ్యం

వీణవంక: మండల కేంద్రానికి చెందిన తోట్ల సరోజన(45) అనే మహిళ 2 రోజులుగా కనిపించడం లేదని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళ భర్త రాజకొంరయ్య తరచూ మద్యం తాగి వచ్చి అకారణంగా తిడుతున్నాడని మనస్తాపం చెంది ఇంట్లో నుంచి ఈనెల 26న వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియలేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

పలువురిపై కేసు

జమ్మికుంట: మడిపల్లి గ్రామానికి చెందిన ల్యాదల్ల మొగిలి అనే వ్యక్తి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి హద్దులు పడేసి టేకు మొక్కలు ధ్వంసం చేసి రూ.30వేల వరకు నష్టం చేశారని అదే గ్రామానికి చెందిన తాళ్లపెల్లి దామోదర్, తాళ్లపెల్లి చంద్రకళ, తాళ్లపెల్లి అజయ్‌పై కోర్టు ద్వారా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

పంట పొలం ధ్వంసం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు శనివారం టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. గండ్రపల్లి గ్రామానికి చెందిన పోలాసాని అశోక్‌రావు అనే వ్యక్తికి చెందిన పంట పొలంలో బాధితుడి అన్న పోలాసాని వెంకటేశ్వరరావు భూమి తగాదా మనుసులో పెట్టుకొని పంట పొలంలో గుర్తుతెలియని గడ్డి మందు చల్లాడు. పొలంలోని పంట ఎండిపోయి పంట నష్టం జరిగిందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టణంలోని అంబేద్కర్‌కాలనీకి చెందిన దాసరాపు పృథ్వీ అనే యువకుడిపై అదే కాలనీకి చెందిన సన్నీ, మధు అనే యువకులు దాడి చేశారు. బాధితుడి తల్లి విజయలక్ష్మి కోర్టు ద్వారా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

కేవీకే మాజీ ప్రధాన కార్యదర్శి మృతి

జమ్మికుంట: పట్టణంలోని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి(74) శనివారం మృతిచెందాడు. మానకొండూర్ మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి 1986లో గ్రామ నవ నిర్మాణ్ సమితి మొదలుకొని వివిధ విభాగాల్లో కేవీకేకు సేవలందించారు.

దేవర క్రియేటివ్ టీంలో జిల్లావాసి



గంగాధర: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా క్రియేటివ్ టీంలో వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన నందగిరి సతీశ్‌రెడ్డి పని చేసి తన ప్రతిభ కనబరిచాడు. సతీశ్‌రెడ్డి హైదరాబాద్‌లో బీఎఫ్ఎలో ఆనిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ ఆర్టిస్ట్‌లో డిగ్రీ పూర్తి చేసి ఆస్కార్ ఎఫ్ఎక్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్నాడు. కంపెనీ తరఫున దేవర సినిమాకు క్రియేటివ్ ఆర్టిస్టుగా అవకాశం వచ్చినట్లు యువకుడు పేర్కొన్నాడు.

ఆర్థిక సాయం

హుజూరాబాద్‌రూరల్: ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్ అనారోగ్యంతో మృతి చెందగా.. శనివారం వారి కుటుంబాన్ని సామాజికవేత్త సబ్బని వెంకట్ పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

వీణవంక: మండల కేంద్రానికి చెందిన గొట్టె భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుమారుడు సాగర్ పదోతరగతి స్నేహితులు రూ.1,116తోపాటు 25 కిలోల బియ్యం అందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జమ్మికుంట: మున్సిపల్‌లోని పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం రాజేశ్వర్‌రావు, కమిషనర్ అయాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు.

మానవహారం..



హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలోని కేసీ క్యాంపులో గల మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ రాగమణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విజయ్, పీఈటీ కవిత, ఏటీపీ రజిత, శివకళ్యాణి, గౌరి, స్వప్న, శానిటరీ జవాన్ రొంటాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటాపాటా..



రామడుగు: అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆటపాటలతో విద్యనందించేందుకు టీచర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వన్నారం అంగన్వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా గుర్తించిన ఐసీడీఎస్ అధికారులు కేంద్రాన్ని అన్ని హంగులతో అందంగా తయారు చేస్తున్నారు. కేంద్రంలో నిర్వహించే పలు కార్యక్రమాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి టీచర్లకు వివరించారు.

రైతుల సహకారంతోనే అభివృద్ధి

సైదాపూర్: రుణాలు తీసుకున్న రైతులు తిరిగి సకాలంలో చెల్లిస్తూ సహకరించడంతోనే సహకార సంఘం అభివృద్ధి చెందుతోందని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అన్నారు. శనివారం వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధ వార్షిక మహాసభ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. సంఘంలో వృథా ఖర్చును తగ్గించుకోవాలని మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సహకార సంఘం ప్రత్యేకాధికారి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, డైరెక్టర్లు రాజిరెడ్డి, రాంరెడ్డి, సౌందర్య, సంపత్, కోమల, తిరుపతి, మోహన్‌రావు, అబ్బయ్య, సీఈవో మల్లారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్: సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి అన్నారు. లక్ష్మీపూర్‌లో ఊటూర్ సొసైటీ అర్ధ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సీఈవో స్వామిరెడ్డి సంఘం వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఎడ్ల సతీష్, మల్లయ్య, భాగ్యమ్మ, లక్ష్మి, రాంరెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

చిగురుమామిడి: రైతులు సింగిల్‌విండో ద్వారా రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి కోరారు. శనివారం చిగురుమామిడిలో సింగిల్‌విండో అర్ధ వార్షిక మహాసభ నిర్వహించారు. మహిపాల్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, చిటమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వంపల్లి అక్రమాలను ఎండగడతాం

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన అవినీతిని త్వరలోనే ఆధారాలతో సహా ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మహాత్మానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ దసరాకు పార్టీలకతీతంగా మహాత్మానగర్ గ్రామస్తులు కమిటీగా ఏర్పడి నిర్వహించే రాంలీలా కార్యక్రమాన్ని తాము సొంత డబ్బులు ఖర్చు చేసి నిర్వహించినట్లు రసమయి తెలిపారు. కవ్వంపల్లి కాంగ్రెస్ నాయకులతో కమిటీ ఏర్పాటు చేసుకొని రాంలీలా పేరిట వసూళ్లకు తెరలేపారని ఆరోపించారు. నియోజకవర్గంలో పది నెలలుగా ఎలాంటి అభివద్ధి జరగడం లేదని, గతంలో తాను చేసిన పనులనే ఇప్పటి ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. అల్గునూర్‌కు చెందిన రియల్టర్ మల్లేశ్‌ను వేధించింది వాస్తవం కాదా అని అన్నారు. తిమ్మాపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, బోయిని కొమురయ్య, సింగిరెడ్డి స్వామిరెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, మాతంగి లక్ష్మణ్, సాయిల్ల కొమురయ్య, శంకర్, రాజేందర్, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ ఇవ్వండి

రసమయి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అసెంబ్లీ ఎన్నికల సమయంలో సరెండర్ చేసిన తన లైసెన్స్‌డ్ రివాల్వర్ తిరిగి ఇవ్వాలని ఎస్సై వివేక్‌ను కోరారు. తాము పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. సీపీ అభిషేక్ మహంతి సేవలు భేష్‌గా ఉన్నాయన్నారు. పార్టీలకతీతంగా లా అండ్ ఆర్డర్ నిర్వహిస్తున్నట్లు అభినందించారు. అనంతరం ఎస్సైతో మండలంలో ఫిర్యాదుదారులకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. చట్టపరంగా వ్యవహరించాలన్నారు. తమ కార్యకర్తలను అకారణంగా ఇబ్బంది పెట్టొద్దని కోరారు. రసమయి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సందమల్ల నరేశ్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీనియర్ నాయకులు సందమల్ల బాబు, బీఆర్‌గౌడ్, దుబాసి బాబు, కేఆర్ భిక్షపతి, రాఘవేంద్ర, సమ్మయ్య, ముక్క రమేశ్, నర్సింగం, చల్లూరి విష్ణువర్ధన్, ముక్క రవితేజ, ఆకునూరి అజిత్, బన్నీ, అనుదీప్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శి రాపెల్లి రోహిత్, రాహుల్, మణిదీప్, రాఘవ, అనిల్, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకం రూపుమాపాలి

చొప్పదండి: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఐ కేర్, ఐ క్యారీ పేరుతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ప్లాస్టిక్ బ్యాగులు, వాటర్ బాటిళ్ల వాడకం మానేసి స్టీల్ బాటిళ్లు, లంచ్ బాక్సులు ఉపయోగించే క్యాంపెయిన్‌ను శనివారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం రూపుమాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



స్టీల్ బాటిళ్లు చూపిస్తున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు

స్వచ్ఛతాహీ సేవాపై అవగాహన

శంకరపట్నం: కేశవపట్నం ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై పారిశుద్ధ సిబ్బందికి పశు వైద్యాధికారి శ్రావణ్ అవగాహన కల్పించారు. 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 60 మంది రక్త నమూనాలు సేకరించారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు ముమ్మరం

చొప్పదండి: వచ్చే బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో పట్టణంలో ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. కుడి చెరువు కట్ట పైన, ముదిరాజ్ సంఘం వెనకవైపు, బ్రాహ్మణికుంట, మర్లవాడ, చిల్లపల్లె, శనిగకుంట ఘాట్ల వద్ద బతుకమ్మల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కుడి చెరువు కట్టపై ఊడ్చే కార్యక్రమం నిర్వహించారు. వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కుడి చెరువు కట్టపై స్వచ్ఛతాహీ సేవా నిర్వహిస్తున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు

షూ, సాక్సులు అందజేత

గన్నేరువరం: కలెక్టర్ సొంత ఖర్చులతో గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 253 మంది విద్యార్థులకు షూ, సాక్సులను అందించగా.. వాటిని పాఠశాలలో విద్యార్థులకు అందజేసినట్లు మండల విద్యాధికారి రామయ్య తెలిపారు.

బహుమతులు..

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ.12వేల విలువైన బహుమతులను రాజమల్లయ్య అందించారు.

పంచాయతీల్లో ఓటరు జాబితా

గన్నేరువరం: మండలంలోని 17 పంచాయతీలకు చెందిన తుది పబ్లికేషన్ జాబితాను మండల పరిషత్ అధికారులు వెల్లడించారు.

అలరించిన మ్యాజిక్ షో

రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాలలో శనివారం కళాకారులు మిమిక్రీ, మ్యాజిక్ షో, టాకింగ్ డాల్ కార్యక్రమాలను నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి

గంగాధర: గ్రామాల్లో నిర్వహించే దసరా నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై నరేందర్‌రెడ్డి సూచించారు.

దారి ఏర్పాటు చేయాలని వినతి

శంకరపట్నం: చింతగుట్టలోని కబ్రస్థాన్‌కు దారి కేటాయించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ముస్లింలు వినతిపత్రం ఇచ్చారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు

సైదాపూర్: మండల కేంద్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువ కావడంతో శనివారం అదనంగా 63 కేవీ సబ్ స్టేషన్‌ను విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేశారు.

రేపటి లోగా ప్రవేశం పొందాలి

హుజూరాబాద్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందడానికి ఈనెల 30 వరకు అవకాశమున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్ర ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు.

హైమాస్ట్ లైట్లు పునరుద్ధరించాలి

చొప్పదండి: పట్టణంలోని క్రీడామైదానంలో హైమాస్ట్ లైట్ టవర్‌ను పునరుద్ధరించాలని నాలుగో వార్డు కౌన్సిలర్ చేపూరి హేమ కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. యూపీఎస్ గ్రౌండ్‌లో ప్రతిరోజు పట్టణవాసులు ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయామం చేస్తున్నారని, క్రీడామైదానంలో నాలుగు హైమాస్ట్ లైట్లు ఉండగా, రెండే పని చేస్తున్నాయని అన్నారు. వెలుతురు లేక వాకర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. లైట్లు పునరుద్ధరించి సౌకర్యవంతం చేయాలని కమిషనర్ నాగరాజును కోరారు.

కార్యవర్గం ఎన్నిక

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలో శ్రీ శ్రీనివాస ఆటో యూనియన్ కమిటీ ఎన్నికయింది. అధ్యక్షుడిగా రాంభద్రస్వామి, ఉపాధ్యక్షుడిగా కుమార్, క్యాషియర్లుగా బూడిమే మహేశ్, ఇజ్జిగిరి రాకేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జమ్మికుంట: మడిపల్లి గ్రామ గీతా పారిశ్రామిక సహకర సంఘం కార్యవర్గాన్ని శనివారం గౌడ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజభాస్కర్, ఉపాధ్యక్షుడిగా నాగపూరి కిరణ్, డైరెక్టర్లుగా నేరేళ్ళ కృష్ణమూర్తి, ఉమ్మగాని సారంగం, మాచర్ల సదానందం, బోనగాని శ్రీనివాస్, ల్యాదల్ల కృష్ణమూర్తి, నాగపూరి తిరుపతి, పంజాల మల్లేష్ ఎన్నికయ్యారు.

శంకరపట్నం: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు దేవునూరి కిష్టయ్య తెలిపారు. కేశవపట్నంలో శనివారం విలేకరులతో మాట్లాడారు.

పాఠశాలలో ఎన్నికలు

చిగురుమామిడి: సుందరగిరి జెడ్పీ పాఠశాలలో మోడల్ గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్నికల విధులను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయభారతికి నివాళి

హుజూరాబాద్: ప్రముఖ రచయిత్రి బొజ్జ విజయభారతి మృతిచెందడంపై శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక

సైదాపూర్: వెన్కెపల్లి విశాల సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎగ్లాస్‌పూర్‌కు చెందిన కొత్త తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ నుంచి వెన్కెపల్లి విశాల సహకార సంఘం డైరెక్టర్‌గా ఒకసారి, మరో దఫా దుద్దెనపల్లి నుంచి డైరెక్టర్‌గా గెలిచి రెండు పర్యాయాలు వెన్కెపల్లి సహకార సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

చొప్పదండి: పోలీసు అమరవీరుల త్యాగాలు చరిత్రపుటల్లో మరువలేనివని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో చొప్పదండి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం పోలీసు అమరుల త్యాగాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.



హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు వెళ్లే దారిలో బోర్నపల్లి వద్ద ప్రమాదకర మలుపుంది. ఈ మూల వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ సమస్యపై స్పందించాల్సిన అధికారి
భూపతిరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ, సెల్ నం.: 9440818421

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: పోషణ మసంలో భాగంగా మండల కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. 100 మంది గర్భిణులకు సీమంతం చేశారు. పది మంది పిల్లలకు అన్నప్రాసన చేశారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కరీంనగర్ రూరల్ సీడీపీవో శ్రీమతి, ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, ఎంపీవో రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, పద్మ, ఐసీడీఎస్ కరీంనగర్ రూరల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం భక్తుల సందడి కనిపించింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	14	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	04	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	08	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	12	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	19	448
పార్వతీపురం స్పెషల్	18	672
పార్వతీపురం సాధారణ	17	336

- వేములవాడ

కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

హుజూరాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన కాల్వ సునీల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదిగా కొన్ని సంవత్సరాలుగా సునీల్‌రెడ్డి పని చేశారు. సునీల్‌రెడ్డి అనేక జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ జాతీయస్థాయిలో తెలంగాణ అసోసియేషన్ తరఫున పాల్గొన్నారు. అండర్ 14, 17, 19 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కాకతీయ యూనివర్సిటీ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించారు. జూనియర్స్ జాతీయస్థాయిలో కూడా పాల్గొన్నారు. సీనియర్ క్రీడాకారులు సంపత్‌రావు, గండ్ర సమ్మిరెడ్డి, రవీందర్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల దామోదర్, రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బుర్ర మల్లేశంకు సన్మానం

గన్నేరువరం: కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బుర్ర మల్లేశంగౌడ్‌ను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కౌండిన్య యూత్ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ సభ్యులు వేర్వేరుగా శనివారం గన్నేరువరంలో సన్మానించారు. సహకార సంఘం మాజీ చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, దుడ్డు మల్లేశం, బూర వెంకటేశ్వర్లు, అనిల్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, తిరుపతిగౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి పేరు తేవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ, అధ్యాపకులు

హుజూరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీఐ తిరుమల్‌గౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో శ్రమదానం

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం, ఆదర్శ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు.

విద్యార్థులకు అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కోతులు, కుక్కల కాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్ తదితరులున్నారు.

సన్మానం

రామడుగు: రామడుగు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌ను పలువురు నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. భీమ్ ఆర్మీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రయ్య, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి రాజయ్య, నేషనల్ హ్యూమన్ రైట్స్ సామాజిక సేవ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు జెట్టుపల్లి అనిల్‌కుమార్, నాయకులు అనిల్, కృష్ణబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

ఇల్లందకుంట: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.రాములును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ శనివారం తహసీల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎండీ రఫీ, భోగం శ్యామ్, భోగం రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఎంఈవో లక్ష్మినారాయణను శనివారం ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సన్మానించారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగే ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు.

గన్నేరువరం: కేడీసీసీబీ డైరెక్టర్‌గా నియమితులైన అలువాల కోటిని శనివారం గన్నేరువరంలో వివిధ పార్టీల నాయకులు సన్మానించారు.

సీడ్ బాల్స్ తయారీ

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను తయారు చేశారు. అక్టోబర్ 2న అటవీ ప్రాంతంలో వెదజల్లనున్నట్లు క్లబ్ మండల అధ్యక్షుడు రామిడి శ్రీనివాస్ తెలిపారు.